నమస్తే తెలంగాణ

మహబూబ్‌నగర్

నారాయణపేట

12 మహబూబ్‌నగర్, మంగళవారం 4 మార్చి 2025 MAHABUBNAGAR NARAYANPET


# రాజుకు ఫోన్‌లో కవిత పరామర్శ

- బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని నేతకు ధైర్యమిచ్చిన ఎమ్మెల్సీ



కొల్లాపూర్, మార్చి 3 : కాంగ్రెస్ గూండాల చేతిలో గాయపడిన బీఆర్‌ఎస్ నేత రాజునాయక్‌ను సోమవారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఫోన్‌లో పరామర్శించారు. దాడిగల కారణాలను అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం మీరొచ్చారని స్వాగతం పలికేందుకు గ్రామ నుంచి ఎక్కువ మందితో రావడాన్ని జీర్ణించుకోలేని స్థానిక అధికార పార్టీ నాయకులు తాను, తన కుటుంబంపై హత్యాయత్నానికి పాల్పడ్డారని వివరించారు. రేవంత్ సర్కారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కాంగ్రెస్ నేతల దౌర్జన్యాలు పెరిగిపోయాయని వాపోయాడు. స్పందించిన కవిత రాజుకు మనోధైర్యాన్ని అందించారు. నీకు, మీ కుటుంబానికి బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. న్యాయ పోరాటం చేద్దాం.. పార్టీ అగ్రనాయకత్వం తోడుగా ఉంటుందన్నారు. దీంతో రాజు సంతోషం వ్యక్తం చేశాడు. బీఆర్‌ఎస్ లేకుండా చేయడం కాంగ్రెస్ తరం కాదని ఎమ్మెల్సీ చెప్పిన మాటలు కొండంత ధైర్యాన్ని ఇచ్చాయని రాజు అన్నాడు.

- అబద్ధాలు సీఎం రేవంత్‌కు అలవాటైంది
- 15 నెలలు గడిచినా పాలనపై దృష్టి పెట్టలేదు
- వనపర్తి పర్యటనతో కొత్తగా ఒరిగిందేమీ లేదు
- కొత్త పనులు చేస్తే మేమంతా స్వాగతిస్తాం
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



మెడికల్ కళాశాలకు శంకుస్థాపన చేస్తున్న కేసీఆర్ ఫొటోను చూపిస్తున్న సింగిరెడ్డి

# పాలమూరును నిలిపి సర్కారు చోద్యం

వనపర్తి, మార్చి 3(నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనులను నిలిపివేసి చోద్యం చూస్తున్నదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి దుయ్యబట్టారు. వనపర్తికి సీఎం పర్యటనతో కొత్తగా ఒరిగిందేమీ లేదని సింగిరెడ్డి కొట్టిపారేశారు. ఇటీవల వనపర్తి సభలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రసంగంపై మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి సోమవారం స్పందించారు. వెయ్యి కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తవుతుందని, ఇందుకు నిధులు ఇవ్వడానికి సీఎంకు చేతులు రావడం లేదన్నారు. పేరుకే జిల్లాకు చెందిన బిడ్డను అని చెప్పుకోవడమే తప్పా ఉమ్మడి జిల్లా రైతులకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. జిల్లాపై చిత్తశుద్ధి ఉంటే.. ఇప్పటికే ఈ ప్రాజెక్టును పూర్తి చేసే పరిస్థితులుండేవని, మొత్తం పనులను నిలిపి మరింత రైతాంగానికి తీరని నష్టం చేశారన్నారు. తక్షణమే ఈ ప్రాజెక్టును పూర్తి చేసి రేవంత్‌రెడ్డి నిబద్ధతను చాటుకోవాలని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు.

వనపర్తిలో సీఎం పర్యటన ద్వారా ఈ ప్రాంతానికి కొత్తగా ఒరిగిందేమీ లేదన్నారు. గత సీఎం కేసీఆర్ వనపర్తికి మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, ప్రభుత్వ దవాఖానలను మంజూరు చేయగా, ఇంతకు ముందే శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. అవి ప్రస్తుతం నిర్మాణ దశల్లో ఉన్నాయని, వాటికి తిరిగి శంకుస్థాపన చేయించడం విడ్డూరమన్నారు. రూ.550 కోట్లను నాటి సీఎం కేసీఆర్ మెడికల్ కళాశాలకు మంజూరు చేశారని, అలాగే రూ.21 కోట్లతో ఐటీ టవర్‌కు అప్పటి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేస్తే.. ఆ శిలాఫలకం పగులగొట్టి తిరిగి రేవంత్‌రెడ్డితో శంకుస్థాపన చేయడం ఎంతవరకు సమంజసమని నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. కొత్తగా రహదారులు, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటును స్వాగతిస్తున్నామని, కొత్తగా ఏ అభివృద్ధిని సాధించినా ఆహ్వానిస్తామన్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన బైపాస్ రోడ్డు, పెబ్బేరు రోడ్డు పనులను నిలిపివేశారని, రూ.120 కోట్ల ఎస్‌డీఎఫ్ పనులను అర్ధాంతరంగా నిలిపి వేశారన్నారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రాధాన్యతను గుర్తించి రూ.22 కోట్లతో పనులకు శంకుస్థాపన చేస్తే.. వాటిని సైతం రద్దు చేశారన్నారు. అలాగే జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలను సాధించుకుని, భవనాల కోసం తొలి విడుతగా రూ.7కోట్లతో పనులు చేపట్టడం జరిగిందని, రెండో దశ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఇప్పటికీ అద్దె భవనంలో కొనసాగుతున్న బీసీ వ్యవసాయ, డిగ్రీ కళాశాలలు అద్దె భవనంలో కొనసాగుతున్నాయని, శాశ్వత భవనం కోసం ప్రయత్నించడం లేదన్నారు. వనపర్తిలో 3,200 డబల్ బెడ్రూంలు, కలెక్టరేట్, ఎస్పీ కార్యాయాలు, రోడ్ల విస్తరణ, ఇంజినీరింగ్, మెడికల్ కళాశాలల అభివృద్ధి మీకు కనిపించడం లేదా అని సింగిరెడ్డి ప్రశ్నించారు.

## రెబల్ కార్యకర్తలా రేవంత్

రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా కాకుండా రాజకీయ పార్టీలో రెబల్ కార్యకర్తలా రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నాడని, అబద్ధాలు చెప్పడం నిరంతరం ఆయనకు అలవాటైందన్నారు. ప్రభుత్వ,పార్టీ సభలకు తేడాతెలియని వారు మన పాలకులుగా ఉండడం మన దౌర్భాగ్యమన్నారు. కేసీఆర్‌ను తిట్టడానికే సభలు పెట్టినట్లుగా ఉందని, అసెంబ్లీ ఎన్నికల ముందు చెప్పిందేమిటీ... చేయాల్సిందేమిటో వదిలేసి.. వెళ్లినచోటల్లా అబద్ధాలు వల్లించడమే రేవంత్ తన దినచర్యగా పెట్టుకున్నాడని విమర్శించారు. గత ప్రభుత్వపైనా కేసీఆర్‌ను గుర్తు చేసుకోకుండా రేవంత్‌కు ఒక్కరోజు కూడా గడవడం లేదన్నారు. ప్రభుత్వం వచ్చి 15 నెలలు గడిచినా కాంగ్రెస్ పార్టీ హామీలు అమలు చేయడం లేదని, పాలన మీద దృష్టి సారించడమే లేదని మాజీ మంత్రి ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో పాత్ర లేని వారు, తెలంగాణకు వ్యతిరేక పార్టీలను మోసిన నాయకులు నేడు కేసీఆర్‌ను చిన్నగా చూపే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తెలంగాణ వచ్చింది కేసీఆర్ ద్వారానే అంటూ ఏపీ ప్రజలంతా చెబుతారు. ప్రతిదానికి కేసీఆర్‌ను నిందిస్తే సమయం వచ్చినప్పుడు వడ్డీతో సహా కక్కిస్తామని నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. 2014కు ముందు ఉమ్మడి పాలమూరులో జూరాల ప్రాజెక్టుతోపాటు కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా కేవలం 12 వేల ఎకరాలకు మాత్రమే సాగునీరందిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఏర్పాటు అనంతరమే పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి సాగునీరిచ్చింది కేసీఆర్ ప్రభుత్వమేనన్నారు. కాంగ్రెస్‌తో దేశానికి, రాష్ట్రానికి నష్టం జరిగిందని బీఆర్‌ఎస్‌లో చేరి మంత్రి అయిన జూపల్లి కృష్ణారావు తిరిగి కాంగ్రెస్ చేరి కేసీఆర్ హయాంలో అసలు ఏ పని జరగలేదని చెప్పడం హాస్యాస్పదమని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో 14 ఏండ్లు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడుగా, మంత్రిగా తొమ్మిదిన్నరేళ్లు పాలమూరు అభివృద్ధి కోసం పార్టీలకతీతంగా పనిచేసిన సందర్భంలో తనను రాజకీయాలు కలుషితం చేశాయి అంటూ రేవంత్ మాట్లాడటం విడ్డూరమన్నారు. చిన్నారెడ్డి ఆదర్శం అంటున్న రేవంత్, ఆయనకు ఏఐసీసీ ఇచ్చిన అసెంబ్లీ టికెట్‌ను అమ్ముకున్నారని స్వయంగా చిన్నారెడ్డి ప్రకటించారు. దీనిపై ఏం సమాధానం చెబుతారన్నారు. ఒక్క నియోజక వర్గంతో జిల్లాను ఏర్పాటు చేస్తారా అంటూ నాడు ఎగతాళి చేసిన రేవంత్, నికార్సైన నాయకుడైతే ఇటీవలి పర్యటనలో తాను పశ్చాత్తాపం ప్రకటించాలన్నారు. కేసీఆర్‌ను ఒప్పించి రామన్నగట్టుకు రూ.50 కోట్లతో రిజర్వాయర్‌ను సాధించుకున్నామని, దానికి మళ్లీ జీవో విడుదల చేసి, శంకుస్థాపన చేశారన్నారు. గతంలో వనపర్తి ఎమ్మెల్యేలుగా పని చేసిన వారికి తగిన ప్రాధాన్యతనివ్వడం జరుగుతూ వస్తున్నదని, వనపర్తి అభివృద్ధికి పునాదులు వేసింది మేమే...పనులు చేసింది మేమేనని నిరంజన్ రెడ్డి ప్రకటించారు. మీరు కొత్తగా పేరు తెచ్చుకోవాలని ఉంటే పనులు చేసి ప్రజల మెప్పు పొందాలని నిరంజన్‌రెడ్డి హితవు పలికారు.



ఆర్డీఎస్ ఆయకట్టులో సాగైన వరి

# చివరికి నీరందేనా..?

- ఆర్డీఎస్‌లో అడుగంటుతున్న నీరు
- పంటలు చేతికొచ్చేనా అంటూ ఆయకట్టు రైతుల ఆందోళన
- టీబీ డ్యాం నుంచి నీటి విడుదలకు అధికారుల చర్యలు

అయిజ, మార్చి 3 : యాసంగి రైతులకు గడ్డుకాలం దాపురించింది. పంటలను ఎలా కాపాడుకోవాలో అని మదనపడుతున్నారు. ఇప్పటికే పలు ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో నీటిమట్టాలు కనిష్ఠ స్థాయికి చేరాయి. ఈ క్రమంలో కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టలో నీటిమట్టం అడుగంటుతోంది. దీంతో ప్రాజెక్టు ఆయకట్టులో పంటలు సాగు చేసిన రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. నీళ్లు అందక పంటలు ఎక్కడ ఎండుతాయేమోనని ఆందోళన చెందుతున్నారు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దులోని సింధనూర్ హెడ్‌రెగ్యులేటరీకి నీరు నిలిచిపోవడంతో ఆర్డీఎస్ ప్రధాన కాల్వ ఒట్టిపోయింది. ఆనకట్ట అడుగంటుతుండంతో అయిజ మండలంలోని ఆయకట్టులో సాగైన వరి, మొక్కజొన్న, వేరుశనగ, మిరప, ఇతర పంటలు చేతికందుతాయే..? లేదోనని రైతులు దిగాలు చెందుతున్నారు. నాలుగు రోజులుగా ప్రధాన కాల్వకు నీరు చేరక పొలాలకు అందడంలేదని వాపోతున్నారు. ప్రస్తుతం ఆర్డీఎస్‌లో 5.6 అడుగుల నీటిమట్టం ఉండగా, కాల్వకు 216 క్యూసెక్కులు చేరుతున్నప్పటికీ కర్ణాటకలోని నాన్ ఆయకట్టు రైతులు మోటర్లతో వీటిని తోడేస్తున్నారు. దీంతో దిగువకు నీరు చేరడంలేదని రైతులు పేర్కొంటున్నారు.

### జాయింట్ ఇండెంట్ విడుదలకు చర్యలు



ఈనెల 5న తెలంగాణ, ఏపీ రాష్ట్రాల రైతులు, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని టీబీ డ్యాం నుంచి జాయింట్‌గా నీటిని విడుదల చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇరు రాష్ట్రాల ఇండెంట్‌లో భాగంగా ఆర్డీఎస్ ఒక టీఎంసీ, కేసీ కెనాల్‌కు 1.6 టీఎంసీలను రోజుకు 4 వేల క్యూసెక్కుల చొప్పున 9 రోజులపాటు విడుదల చేస్తారు. ఈ నీరు వస్తే పంటలు చేతికొచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. రైతులు అధికారులకు పూర్తిగా సహకరించాలి.

**- విజయ్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఎస్ ఈఈ**

### టీబీ డ్యాంలో 31.216 టీఎంసీలు

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంలో ప్రస్తుతం 31.216 టీఎంసీలు నిల్వ ఉండగా, అవుట్‌ఫ్లో 7,178 క్యూసెక్కులుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా ప్రస్తుతం 31.216 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. 1633 అడుగుల పూర్తిస్థాయి నీటి మట్టానికిగానూ ప్రస్తుతం 1606.52 అడుగులుగా నమోదైంది.





# వట్టెంలో నిరసన

బిజినేపల్లి, మార్చి 3 : గత వారం రోజులుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదంటూ మండలంలోని వట్టెం గ్రామ ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం మహిళలు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. పంచాయతీ కార్యదర్శి అందుబాటులో లేకపోవడం తో స్థానిక వాటర్‌మెన్ లక్ష్మయ్యతో మాట్లాడి వీలైనంత త్వరలో భగీరథ నీరు పునరుద్ధరణ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.



మేడికొండ సమీపంలో ఆర్డీఎస్ ప్రధాన కాల్వలో నిలిచిన ప్రవాహం

### 5న ఆర్డీఎస్, కేసీ కెనాల్ జాయింట్ ఇండెంట్‌కు చర్యలు

- 5 నుంచి 13 వరకు రోజుకు 4 వేల క్యూసెక్కులు

టీబీ డ్యాం నుంచి ఈనెల 5 నుంచి ఆర్డీఎస్‌తోపాటు కేసీ కెనాల్ ఇండెంట్‌ను జాయింట్‌గా విడుదల చేసేందుకు ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. ఆర్డీఎస్ టీఎంసీ, కేసీ కెనాల్‌కు 1.6 టీఎంసీలు 13వ తేదీ వరకు రోజుకు 4 వేల క్యూసెక్కులు విడుదల చేసేందుకు తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ఇరిగేషన్ ఈఎన్‌సీలు టీబీ బోర్డుకు లేఖలు రాశారు. విడుదలైన నీరు తుంగభద్ర డ్యాం నుంచి ఆర్డీఎస్ ఆనకట్టకు 8 లేదా 9న ఆనకట్టకు చేరే అవకాశం ఉన్నదని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆనకట్టకు సకాలంలో నీరు చేరితేనే పంటలు ఎండవని, ఆ దిశగా అధికారులు చొరవ తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

# లక్ష్మారెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



మాజీ మంత్రి లక్ష్మారెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

జడ్చర్లటౌన్, మార్చి 3 : తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా మొట్టమొదటగా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన రోజును పురస్కరించుకొని సోమవారం జడ్చర్లలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ యాదయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎమ్మెల్యే పదవిని సైతం లెక్కచేయకుండా డాక్టర్ లక్ష్మారెడ్డి రాష్ట్రంలోనే మొదటగా రాజీనామా చేశారని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే పేదలకు అన్ని విధాలా లబ్ధిచేకూరిందని వివరించారు. కార్యక్రమంలో బాదేపల్లి సింగిల్‌విండో అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు రఘుపతిరెడ్డి, మురళి, నాగిరెడ్డి, శ్రీశైలం యాదవ్, హపీజ్, ఇంతియాజ్, కౌన్సిలర్లు ఉమాశంకర్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, మహేశ్, జ్యోతి పాల్గొన్నారు.



టన్నెల్‌లోంచి బయటకు వస్తున్న రెస్క్యూ బృందాలు

# ఊటనీరే ఆటంకం

- ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ వద్ద సవాల్‌గా రెస్క్యూ ఆపరేషన్
- పదో రోజు సహాయక చర్యలు
- శ్రమిస్తున్న 12 రెస్క్యూ బృందాలు
- కన్వేయర్ బెల్ట్‌కు మరమ్మతులు
- కొలిక్కిరాని మృతదేహాల గుర్తింపు

నాగర్‌కర్నూల్, మార్చి 3 : జిల్లాలోని దోమలపెంట ఎల్‌ఎల్‌బీసీ (శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్) టన్నెల్‌లో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. పదో రోజు బృందాలచే సహాయక చర్యలు కొనసాగాయి. జీపీఆర్ ద్వారా గుర్తించిన అనుమానిత ప్రాంతాల్లో రెస్క్యూ టీంలు తవ్వకాలు చేపడుతున్నాయి. చెలిమల ద్వారా ఊటనీరు పెరిగి బురదగా మారి టన్నెల్‌లోకి చేరుతోంది. దీంతో సహాయక చర్యలకు సైతం ఆటంకంగా మారింది. టన్నెల్లోని 13.5 కిమీటర్ వద్ద ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాల్లో అధికారులు రోబోలను వినియోగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పది రోజులుగా టన్నెల్‌లో అన్ని రెస్క్యూ టీమ్‌లతో తనిఖీలు చేస్తున్నా తప్పిపోయిన ఎనిమిది మంది కార్మికుల జాడ బయటపడలేదు. ఊరుతున్న నీటిని హెవీ మోటర్ల ద్వారా ఎప్పటికప్పుడు బయటకు తరలిస్తున్నారు అయినా బురదను తరలించడం సవాల్‌గా మారింది. కన్వేయర్ బెల్ట్‌కు మరమ్మతులు చేపడితే మట్టితోపాటు చిన్నరాళ్లు, ఇతర వ్యర్థాలను బయటకు తరలించడం ఈజీ మార్గంగా గుర్తించారు. దీంతో కన్వేయర్ బెల్ట్‌ను బాగు పనిలో సోమవారం అధికారులు నిమగ్నమయ్యారు. లోకో ట్రెయిన్ ద్వారా బురదనీటిని తోడుతున్నా ట్రెయిన్ ఒక్కసారి బయటకు వచ్చిపోయే సరికి రెస్క్యూ టీమ్ తోడిన బురద, నీటికి పదింతలు మళ్లీ పెరుగుతుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇదిలా ఉండగా.. ఓ వైపు టన్నెల్‌లో ఇరుక్కుపోయిన తమ వారి కోసం కుటుంబ సభ్యులు బోరున విలపిస్తూ ఎదురు చూస్తున్నారు.

### హైరిస్క్‌గా రెస్క్యూ

టన్నెల్‌లో కార్మికులు చిక్కుకొని పది రోజులు కావస్తున్నా.. ఊట నీరు, బురద కారణంగా కార్మికులను బయటకు తీయడం రెస్క్యూ టీమ్‌కు సవాల్‌గా మారింది. పది రోజులు కావస్తున్నా.. టన్నెల్‌లోకి నీరు చేరకుండా అధికారులు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోకపోవడంతో రెస్క్యూ టీమ్ చేస్తున్న కష్టానికి ఫలితం లేకుండాపోయింది. టన్నెల్‌లో చిక్కుకున్న వారిని ఎలా బయటకు తీయాలని సమీక్ష నిర్వహిస్తూ పనులు చేపడుతున్న అధికారులు ఉబికి వస్తున్న నీటికి అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ప్రమాదం జరిగిన టన్నెల్‌లోని 13.5 కిలోమీటర్ వద్ద మట్టిదిబ్బలు కూలిపడడంతో అక్కడి పరిస్థితులు ఎలా ఉన్నాయనే విషయాలపై అధికారులకు స్పష్టత రాలేదు. ఆధునికమైన పరికరాలను ఉపయోగించి సహాయక చర్యలు చేపడుతున్నప్పటికీ ఫలితం లేకపోతోంది. 12 సంస్థలకు సంబంధించిన బృందాల అధికారులతో సలహాలు, సూచనలు తీసుకుంటూ అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ప్రత్యేక నిపుణుల పర్యవేక్షణలో సొరంగంలో మట్టి, బురద, కాంక్రీట్ శిథిలాలను తొలగించేందుకు అవసరమైన అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడానికి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నట్లు మీడియాకు వివరించారు. సొరంగంలోకి ఇరువైపులా నుంచి నీరురాకుండా అలాగే సొరంగంలో ఇప్పటికే నిలువ ఉన్న నీటిని తొలగించే ప్రక్రియను వేగవంతం చేశామని దీనికోసం ప్రత్యేకంగా యంత్రాలు నిరంతరం పనిచేస్తున్నాయని అధికారులు తెలిపారు. అయితే ప్రస్తుతం టన్నెల్ సొరంగం వెళ్లిన ప్రాంతం మల్లెలతీర్థం వరకు ఉంటుందని సర్వే బృందాలు పేర్కొంటున్నాయి. అయితే టన్నెల్ నిర్మాణం భూమిపై నుంచి లోపలికి 650 మీటర్లు వరకు ఉండగా టన్నెల్‌పైనా 450మీటర్ల ఎత్తులో నుంచి భూగర్భలోంచి జలం నీటి ఊటగా టన్నెల్‌లోకి వస్తుందని సర్వే బృందం అంచనా వేస్తున్నది.

### రెస్క్యూ టీమ్‌తో ఉన్నతాధికారుల సమీక్ష

ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో పాలుపంచుకున్న రెస్క్యూ టీమ్‌తో అధికారులు సమీక్ష నిర్వహించారు. సోమవారం ఎస్‌ఎల్‌బీసీ ప్రమాద ప్రదేశంలో ఉన్న మట్టిని తొలగించేందుకు కన్వేయర్ బెల్ట్‌కు మరమ్మతులు చేసినట్లు వెల్లడించారు. బెల్ట్ సహాయంతో మట్టిని తొలగించేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. డీవాటరింగ్ ప్రక్రియ కూడా వేగంగా కొనసాగుతుందని, రెస్క్యూ ఆపరేషన్‌లో పాలుపంచుకున్న బృందాలతో అధికారులు.. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ ప్రమాద ప్రదేశంలో జరుగుతున్న సహాయక చర్యలు, ఎదురవుతున్న సమస్యలపై విశ్లేషించారు. పాల్గొంటున్న సంస్థలకు సంబంధించిన బృందాలతో అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ చేపట్టాల్సిన చర్యలపై ప్రత్యేకాధికారులతో సలహాలు, సూచనలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రత్యేక నిపుణుల పర్యవేక్షణలో సొరంగంలో మట్టి, బురద, కాంక్రీట్ శిథిలాలను తొలగించేందుకు అవసరమైన అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడానికి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు. ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలోకి మీద నుంచి, ఇరువైపుల నుంచి నీరు రాకుండా చూడడంతోపాటు ఇప్పటికే నిల్వ ఉన్న నీటిని తొలగించే ప్రక్రియను వేగం చేశారు. దీనికోసం ప్రత్యేకంగా యంత్రాలు నిరంతరం పనిచేస్తున్నాయని అధికారులు వెల్లడిస్తున్నారు.

టన్నెల్‌లోంచి బురదను బయటకు తీసుకువస్తున్న దృశ్యం





టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

# బీసీల జనాభాను తక్కువ చూపిస్తున్నారు

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, జాతీయ ఓబీసీ నాయకుడు సూరజ్‌యాదవ్ మండల్



ఓబీసీ యూత్ సమ్మిట్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 3 : తెలంగాణలో బీసీలను జనాభాను తక్కువచేసి చూపించడంలో కుట్ర దాగుందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, జాతీయ ఓబీసీ నాయకుడు, బీపీ మండల్ మనుమడు ప్రొఫెసర్ సూరజ్ యాదవ్ మండల్ ఆరోపించారు. ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన హైదరాబాద్‌లోని సావిత్రీబాయి పూలే ఆడిటోరియంలో నిర్వహించే ఓబీసీ యూత్ లీడర్‌షిప్ సమ్మిట్ – 2025 పోస్టర్‌ను సోమవారం శంషాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ప్రొఫెసర్ సూరజ్ యాదవ్ మండల్, ఉత్తరప్రదేశ్, ఒడిశా మాజీ ఎంపీలు శ్యాంసింగ్ యాదవ్, సస్మట్‌పాత్ర, ఆంధ్రప్రదేశ్ ఎంపీ మస్తాన్‌రావుతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఓబీసీ డిమాండ్ల సాధనలో విద్యార్థులు భాగస్వాములై ఓబీసీ ఉద్యమానికి వెన్నెముకగా నిలవాలని పేర్కొన్నారు. ఓబీసీ విద్యార్థులకు విద్యా, ఉద్యోగం రిజర్వేషన్లల్లో జరుగుతున్న అన్యాయాన్ని వివరించాలన్నారు. జనాభా దామాషా ప్రకారం ఓబీసీలకు చట్ట సభలు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్ల సాధనకు పాటుపడాలన్నారు. తెలంగాణలో ఓబీసీ జనాభా ఎంత అన్నది కచితంగా లెక్క చూపకపోవడం పలు అనుమానాలను తావిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేపట్టే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని విద్యార్థులకు సూచించారు. కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, లేదంటే అన్ని రాష్ట్రాల్లో ఓబీసీ ఉద్యమాన్ని బలోపేతం చేసే విధంగా కార్యచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. అనంతరం ఆల్‌ఇండియా ఓబీసీ స్టూడెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్ మాట్లాడుతూ ఓబీసీ యూత్ లీడర్‌షిప్ సమ్మిట్ వల్ల యువత వివిధ రంగాల్లోతో పాటు రాజకీయం, బ్యూరోక్రటిక్, వ్యాపార అకాడమీ, వృత్తి పరంగా సాంస్కృతిక రంగాల్లో రాణించి మార్గనిర్దేశం చేయడానికి సమ్మిట్ – 2025 ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఢిల్లీ యూనివర్సిటీ ఓబీసీ నాయకులు సందీప్‌కుమార్, బనారస్ హిందూ యునివర్సిటీ ఓబీసీ నాయకులు కృష్ణకాంత, ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కొడంగల్ సర్వే పనులను అడ్డుకొన్న రైతులు

నారాయణపేటరూరల్, మార్చి 3 : నారాయణపేట జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి ఏర్పాటు చేస్తున్న నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు పథకం సర్వే పనులను ముందస్తు సమాచారం లేకుండా సర్వే చేపట్టడంతో రైతుల నుంచి అధికాలకు అడుగడుగునా అటంకాలు ఎదురవుతున్నాయి. వాస్తవంగా ప్రభుత్వ భూముల్లో సర్వే చేపట్టడానికి ఎలాంటి నోటీసులు ఇవ్వవలసిన అవసరం లేదని అదే పట్టా భూముల్లో తమకు కనీస సమాచారం ఇవ్వకుండా తమ పొలాలను కొలిచి తమ పొలంలో మార్కింగ్ ఇవ్వడం ఏమిటని రైతులు ఎదురు తిరుగుతున్నారు. సరిగ్గా ఇదే పరిస్థితి మండలంలోని సింగారం గ్రామ పంచాయతీ పరిధిలోని కౌరంపల్లి శివారులో సోమవారం చోటు చేసుకొంది. రెవెన్యూ ఆర్ఐ గోపాల్‌రావు, జూనియర్ అసిస్టెంట్ల బృందం సర్వేపనులు చేపట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో పేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులలో తమ విలువైన భూములు కోల్పోతామని రైతులు హన్మంతు, మాశప్ప, చిన్నబాలప్ప, నర్సింహ, రాములు, మాశప్ప తదితరులు సర్వే అధికారులను అడ్డుకొన్నారు. తమ భూముల్లో ఎలాంటి పనులు చేపట్టేందుకు వీలు లేదని తమ భూములు ఇవ్వమని తెగేసి చెప్పారు. తమకు ఉన్నదే కొద్ది పాటి పొలం అని అందులో ఈ ఎత్తిపోతల పనులకు పోతే తమ కుంటుంబాల పరిస్థితి ఏం టని అధికారులకు తమ గోడు వినిపించడంతో అధికారులు వెనుదిరిగారు.



రైతులు సర్వే పనులు అడ్డుకోవడంతో వెనుదిరిగిన అధికారులు